వ్యర్థాలతో తప్పని తిప్పలు

- ఖాళీస్థలాల్లో చెత్తాచెదారం
- పందులు, కుక్కల వీరవిహారం
- అధికారులు స్పందించాలని వేడుకోలు


చందుగూడ పాఠశాల వెనకభాగంలో మురికినీరు


నెహ్రూనగర్‌లో పడేసిన వ్యర్థాలు

కెరమెరి: మండల కేంద్రంలోని ఖాళీ స్థలాల్లో ప్రజలు వ్యర్థాలు పడేస్తుండడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. మూడు రోజుల క్రితం వరకు ఎడతెరిపి వానలతో ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలు వర్షపు నీటితో పాటు మురుగు నీరు చేరి వ్యాధులకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇటు గ్రామ పంచాయతీ అధికారులు కానీ స్థల యజమానులు కానీ పట్టించుకోకపోవడంతో పరిసర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. కొన్ని ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు పిచ్చిమొక్కలు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి.

సీజనల్ వ్యాధులకు ఆస్కారం

మండల కేంద్రంలోని నెహ్రూనగర్, సుల్తాన్‌గూడ, చందుగూడ తదితర ప్రాంతాల్లో ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలు కుక్కలు, పందులకు నిలయాలుగా మారాయి. వీటితో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదాలు ఉన్నాయి. చిన్న వర్షం కురిసినా ఖాళీ స్థలాల్లో పడేసిన చెత్తా చెదారంతో దుర్గంధం వెదజల్లుతుంది. కాగా రాత్రి వేళల్లో విష సర్పాలు కూడా సంచరిస్తున్నాయి. రాత్రి వేళల్లో, తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లే వారికి పాములు తారస పడుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో చీకటి కావడంతో రోడ్లపై అటుఇటు తిరుగుతున్నాయి. ఖాళీ స్థలాలను బాగు చేయకుంటే సమీప ప్రాంతవాసులు వ్యాధుల బారిన పడే ఆస్కారం ఉంది.

మాంసానికి అలవాటుపడి..

కొందరు మాంస విక్రేతల నిర్లక్ష్యం కారణంగా శునకాలు మాంసం వ్యర్థాలకు అలవాటు పడుతున్నాయి. కొందరు స్థానికంగా వ్యరోర్థ పడేయడంతో శునకాలు, పందులు అక్కడే సంచరిస్తున్నాయి. వ్యర్థాలు దొరకని సమయంలో ప్రజలపై దాడి చేసి గాయపరుస్తున్నాయి. అధికారులు వెంటనే దృష్టి సారించి చర్యలు చేపట్టకపోతే ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుంది. చందుగూడ పాఠశాల వెనుక భాగంలో మురికి నీరు ప్రవహిస్తుండడంతో విద్యార్థులు, సమీప గృహాలు వారు ఇబ్బందులు పడుతున్నారు. మురికి నాలాలు కూడా లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తుంది.

చర్యలు తీసుకుంటాం



ఖాళీ ప్రాంతాల్లో చెత్తాచెదారం వేయకూడాదు. అలా వేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. ఇళ్ల సమీపంలో చెత్తాచెదారం వేయకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి.

– ఎండీ అంజద్‌పాషా, ఎంపీడీవో

అంబేద్కర్ చౌరస్తా సమీపంలో ట్రాఫిక్ ఇబ్బందులు



రోడ్లపైనే పార్కింగ్

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు


కాగజ్‌నగర్‌లోని బట్టల దుకాణాల రోడ్డులో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారులపై గంటల తరబడి వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేస్తుండడంతో ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ఇందిరా మార్కెట్ రోడ్డుపైనే పండ్లు, కూరగాయల వ్యాపారులు రోడ్డపైకి వచ్చి షెడ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారం చేస్తుండడంతో మార్కెట్‌కు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

రోడ్డుపైనే పూలు, పండ్ల బండ్లు

అంబేద్కర్ చౌరస్తా నుంచి ఫైఓవర్ బ్రిడ్జి వరకు ఉన్న రోడ్డుకు ఇరువైపుల దుకాణాల యజమానులు ఫుట్‌పాత్ దాటి రోడ్డుపైకి షెడ్లు వేసుకోవడంతో ఆటోలు, కార్లు వచ్చిన సమయంలో పాదాచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే పొట్టి శ్రీరాములు చౌరస్తా నుంచి కన్యాకాపరమేశ్వరి దేవాలయం రోడ్డులో మార్కెట్‌కు వచ్చే వాహనాలు, చికెన్ సెంటర్లకు వచ్చే కోళ్ల వ్యాన్లు గంటల తరబడి రోడ్డుపైనే పార్కింగ్ చేయడంతో ఆలయానికి వచ్చే భక్తులు తిప్పలు పడుతున్నారు. చికెన్ సెంటర్లకు వచ్చే కోళ్ల వ్యాన్లను రోడ్డుపై కాకుండా దూరంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆలయాలు మూసివేత


శివాలయానికి తాళం వేస్తున్న అర్చకుడు


ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకుడు వినోద్

కెరమెరి: చంద్రగ్రహణం నేపథ్యంలో మండ ల కేంద్రంలోని శివాలయాన్ని ఆదివారం ఉదయం 9:30 గంటలకు మూసివేశారు. తిరిగి సోమవారం ఉదయం 5 గంటలకు ఆలయ తలుపులు తెరుస్తామని అర్చకుడు కులకర్ణి బాపూదేవ్ తెలిపారు. ఆలయ శుద్ధి, సంప్రోక్షణ, అభిషేకాల అనంతరం శివుని దర్శనం ఉంటుందని, భక్తులు గమనించాలని పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యుడు కోట్రంగే శ్రీనివాస్ ఉన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: సంపూర్ణ చంద్రగ్రహణం పురస్కరించుకుని మండలంలోని ఆలయాలను మూసివేశారు. ఆదివారం రాత్రి సంపూర్ణ చంద్రగ్రహణం ఉండటంతో మధ్యాహ్నం నుంచే గంగాపూర్‌లో గల శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయాన్ని అర్చకులు మూసివేశారు. సోమవారం ఉదయం 6గంటలకు ఆలయ శుద్ధి, సంప్రోక్షణ అనంతరం అభిషేక పూజల అనంతరం భక్తులకు దర్శనాలను కల్పిస్తున్నట్లు ఆయా ఆలయాల అర్చకులు కొమ్మెర గణేశ్ శర్మ, దేవార వినోద్‌స్వామిలు తెలిపారు.

ఎదగని పత్తి..!


మోతుగూడలో ఎదగని పత్తి మొక్కలు

- భారీ వర్షాలతో దిగుబడిపై ప్రభావం
- దిగాలు చెందుతున్న రైతులు

ఆసిఫాబాద్‌రూరల్: ఏటా పంటల సాగులో రైతులు ఏదో ఒక రకంగా నష్టపోతున్నారు. ఈ ఖరీఫ్‌లో కూడా వర్షాలు రైతులకు తీవ్ర నష్టాలు మిగిల్చాయి. జిల్లాలో అత్యధికంగా సాగు చేస్తున్న పత్తి పంటపై వర్షాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ సీజన్ మొదట్లో తక్కువగా వర్షపాతం నమోదైంది. కాగా జూలై, ఆగస్టు నెలల్లో భారీ వర్షాలు కురవడంతో సాగుపై తీవ్ర ప్రభావం పడింది. వాగులు, వంకల సమీపంలోని పత్తి పంటలు పూర్తిగా నీటమునిగాయి. భారీ వర్షాలకు పత్తి చేలల్లో నీరు నిలిచి పంట ఎదగకుండా ఎర్రబడింది. ఆసిఫాబాద్ మండలంలో రైతులు గతంలో ఎక్కువగా పప్పుదినుసులు, కంది, పెసర, జొన్న, సోయా పంటలు సాగు చేసేవారు. కానీ పదేళ్ల నుంచి పత్తి పంట సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. గత ఏడాది మండలంలో 36 వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేశారు.

ఎదగని పత్తి పంట..

భారీ వర్షాలతో పత్తి పంట ఎదుగుదల పూర్తిగా మందగించింది. ఇప్పటి వరకు 6 నుంచి 7 ఫీట్ల ఎత్తులో ఉండాల్సిన మొక్కలు 2 నుంచి 4 ఫీట్ల ఎత్తు వరకు మాత్రమే పెరిగాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వానలకు చేలల్లో నీరు నిలిచి పత్తి పంట ఎర్రబడి పెరుగుదల లేకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే నాలుగు, ఐదు సార్లు మందులు పిచికారీ చేసినా మొక్కల్లో ఎదుగుదల లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొలక దశలో మొదలైన ముసురులతో పత్తి పంటపై ప్రభావం పడిందని రైతులు పేర్కొంటున్నారు. ఈ దశలో ఒక్కో పత్తి చెట్టుకు 30 నుంచి 40 కాయలు ఉండాలి. కానీ 10 నుంచి 20 కాయలు కూడా లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది జూలై, ఆగస్టుల లో భారీ వర్షాలతో పంటకు తీవ్ర నష్టం జరిగింది.

పత్తికి చీడపీడలు..

విత్తనాలు వేసిన నాటి నుంచి వర్షాలు కురువడంతో పత్తిపంట ఆశించిన స్థాయిలో పెరగలేదు. దీనికి తోడూ గతంలో ఎన్నడూ లేని విధంగా పేనుబంక, వేరుకుళ్లు తెగులు, ఆకులు రాలిపోవడం మరోవైపు చీడపీడలు వ్యాప్తి చెందాయి. పత్తి పంటకు అధికంగా గులాబీరంగు పురుగు ఆశించి నష్టపరుస్తుంది. గులాబీరంగు పురుగు కాయకు రంధ్రం చేసి పత్తి పంటకు నష్టం చేస్తుంది. పత్తి క్వాలిటీ, దిగుబడి కూడా తగ్గే ప్రమాదం ఉంది. దీని నివారణకు వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించకపోవడంతో రైతులు ఎరువుల షాప్ యజమానులు ఇచ్చిన మందులను వాడుతున్నారు.

క్లుప్తంగా

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు సన్మానం

ఆసిఫాబాద్: వాసవీక్లబ్ వ్యవస్థాపకులు కేసీ గుప్తా జయంతిని శనివారం రాత్రి జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో ఘనంగా జరుపుకున్నారు. వారం రోజుల పాటు నిర్వహించే వేడుకల్లో భాగంగా క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జర్నలిస్టులు బాల శ్రీనివాస్, రావుల శంకర్, గణపురం మహేశ్, దేవనూరి రమేశ్, చీల నితేశ్‌లను శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పాత శ్రీనివాస్, ముక్క కృష్ణమూర్తి మాట్లాడుతూ జర్నలిస్టుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గుండ ప్రమోద్, రావుల వెంకటేశ్వర్, కాచం వినేశ్, కొలిప్యాక శంకర్, పాపిని శంకర్, గంధం వేణు, సభ్యులు పాల్గొన్నారు.

సామూహిక వివాహాలకు రిజిష్టర్ చేసుకోండి

వేమనపల్లి: అక్టోబర్ 26న బెల్లంపల్లిలోని బుధాగెస్ట్‌హౌస్ రోడ్డు శివాలయంలో నిర్వహించే ఉచిత సామూహిక వివాహాలకు యువతి, యువకులు అక్టోబర్ 1వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని మాజీ జెడ్పీటీసీ సంతోష్‌కుమార్ అన్నారు. నీల్వాయిలో ఆదివారం పోస్టర్ ఆవిష్కరించారు. తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వివాహాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని కేబీ చౌక్ వద్ద గల 11 కేవీఏ లైన్‌లో 34 ఎస్క్యూఎంఎం నుంచి 55 ఎస్క్యూంఎం వైర్ మార్చే పనుల్లో భాగంగా సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పైకాజీనగర్, కంటకాలనీ, కేబీచౌక్ ప్రధాన రహదారి, వినాయకనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ లక్ష్మీరాజ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

వాంకిడి: మండలంలోని డొంగర్‌గాం గ్రామానికి చెందిన దేవుబాయి అనే బాలింత ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు బీజేపీ మండల అధ్యక్షుడు చీదర్ల నరేశ్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. దేవుబాయి కుటుంబాన్ని పరామర్శించి ది హోప్ ఫౌండేషన్ సహకారంతో రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు చీదర్ల మధుకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారుడికి సన్మానం


మహేందర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

నార్నూర్: ఉత్తరప్రదేశ్‌లో ఆగస్టు 31న జరిగిన 16వ జాతీయస్థాయి థాయ్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో గాదిగూడ మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన సిడం సోము, గౌతమిబాయి కుమారుడు సిడం మహేందర్ నిలిచారు. గోల్డ్ మెడల్ సాధించిన మహేందర్‌ను ఆదివారం గ్రామస్తులు, కుటుంబసభ్యులు, ఝరి రాయి సెంటర్ నాయకులు ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ.. ఆదివాసీలు గర్వించేలా మహేందర్ జాతీయస్థాయిలో బాక్సింగ్ పోటీలో రాణించడం సంతోషంగా ఉందన్నారు. యువకుడిని ఐటీడీఏ అధికారులు ప్రోత్సహించాలని కోరారు. గ్రామపటేల్ సిడం జంగు, ఝరి రాయిసెంటర్ సార్‌మేడి మందాడి దౌలత్ రావు, కొడప జాకు, మెస్రం శేఖర్, మెస్రం లింగు, సోయం మరోతి, పెందూరు సంతోష్, పుసం బాదిరావు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

బోథ్: మండల కేంద్రంలో వంజరి సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వంజరి సంఘ సభ్యులు బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మె ల్యే అనిల్ జాదవ్, భవన నిర్మాణానికి త్వరలో నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక


కండువా కప్పుతున్న డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

కాగజ్‌నగర్‌టౌన్: సిర్పూర్(టి) పారిగాం గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో ఆదివారం చేరారు. వీరికి బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అందరూ కలిసి కృషి చేయాలని సూచించారు. పార్టీలో చేరిన వారిలో ఎల్కర్ చందు, సుగుణాకర్, సాయినాథ్, గజానంద్, చందు, మోతిరాం, కుండగుర్లే హీరామన్‌లు ఉన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అస్లాంబిన్ అబ్దుల్లా, కోకన్వీనర్ పనస లక్ష్మణ్, కొండగుర్లె విలాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం


మోడీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: దేశంలో జీఎస్టీపై సంస్కరణలు తీసుకొచ్చిన భారత ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి ఆదివారం జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావ్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూర్చే విధంగా దీపావళి కానుకగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీపై సంస్కరణలు తీసుకురావడం హర్షించదగ్గ విషయమన్నారు. రైతుల నుంచి వ్యాపారుల వరకు ఇండ్ల నుంచి కంపెనీల వరకు ప్రతి ఒక్కరికి లాభాదాయకమన్నారు. అట్టడుగు వర్గాల పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. దేశ ప్రజలకు ప్రధాని నరేంద్ర మోడీ చారిత్రాత్మక దీపావళి బహుమతిగా అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లిఖార్జున్, పెంటన్న, పంచదార దీపక్‌రావ్, పోశన్న, ప్రహ్లాద్, రేవతి, రేణుక, సత్యనారాయణ, మురళీగౌడ్, జయరాజ్, వెంకటేశ్, కోటేష్, లచ్చన్న, ప్రసాద్‌గౌడ్, సందీప్‌కుమార్, కేశవ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

బోథ్: పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు పోతుందని ఏఐసీసీ తెలంగాణ రాష్ట్ర విచార్ విభాగ్ కోఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ అన్నారు. ఆదివారం నూతన రేషన్‌కార్డులు పొందిన లబ్ధిదారులకు సొనాల మండల కేంద్రంలో సన్నబియ్యం అందించారు. గత పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకుండా సామాన్య ప్రజానీకాన్ని మోసం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బత్తుల రమేశ్, గాజుల పోతన్న, చెట్లపల్లి అనిల్, పోశెట్టి, అమత్‌రావు పాటిల్, రాందాస్ పాల్గొన్నారు.

నేడు రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం

ఇచ్చోడ: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనంద్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండల పరిషత్ ఎన్నికలకు సంబధించిన డ్రాఫ్ట్ ఓటరు జాబితా సంబధిత ప్రాదేశిక నియోజవర్గ నోటీసు బోర్డుల మీద ప్రచురించినట్లు తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని రాజకీయ పార్టీల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

రోడ్డుపై నాచు..!



కెరమెరి: మండలంలోని ఇందాపూర్, ఉబ్రి గ్రామాల మధ్యలో ఉన్న కల్వర్టుపై నుంచి ప్రతిరోజు నీరు ప్రవహిస్తుంది. దీంతో ఆ నీటిలో నాచు అధికంగా ఉండడంతో పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు జారి పడిపోతున్నారు. ఇప్పటివరకు ఏడుగురు ద్విచక్ర వాహనదారులు ఈ ప్రాంతంలో జారి పడడంతో గాయాలపాలయ్యారు. దీంతో ప్రయాణికులు అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

అఖండ జ్యోతి సంపూర్ణ కార్యక్రమం


భజన కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్తులు

నేరడిగొండ: మండలంలో ని కుమారి గ్రామంలో గల శ్రీ గురుదేవ సేవా ఆశ్రమంలో అఖండ జ్యోతి సంపూర్ణ కార్యక్రమాన్ని ని ర్వహించారు. ఈ సందర్భంగా ఓంకార పూజ, భజన కార్యక్రమాలను భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిపారు. నిర్వాహకులు మాట్లాడుతూ అఖండ జ్యోతి కార్యక్రమం గ్రామ ప్రజల ఐక్యతకు, ఆధ్యాత్మిక ప్రేరణకు దోహదం చేస్తుందన్నారు. ఆశ్రమ నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా, గ్రామ పెద్దలు, సేవాశ్రమ సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

రోడ్డు శుభ్రం చేయించిన పోలీసులు

మందమర్రిరూరల్: పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో ఆదివారం తాగుబోతు హల్చల్ చేశాడు. ఖాళీ బీరు సీసాలు రద్దీగా ఉండే రోడ్డుపై పగుల గొట్టాడు. రోడ్డుపైన సీసల ముక్కలు ప్రమాదకరంగా పడి ఉండడంతో స్థానికులు పోలీసులకు తెలియజేశారు. అక్కడికి చేరుకున్న పోలీసులు తాగుబోతుతోనే రోడ్డును శుభ్రం చేయించారు.

నేడు అఖిలపక్ష సమావేశం

వేమనపల్లి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం రెండో విడత సాధారణ ఎన్నకలు 2025ఎంపీటీసీ, జెడ్పీటీసీల డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్‌ల జాబితా సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కుమారస్వామి తెలిపారు. ఈ సమావేశానికి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, మండల అధ్యక్షులు హాజరుకావాలని కోరారు.

రైతులకు రాయితీపై పరికరాలు

కాసిపేట: మండలంలోని రైతులకు 2025–26సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ యాంత్రికరణలో భాగంగా ప్రభుత్వం రాయితీపై పనిముట్లు అందిస్తుందని మండల వ్యవసాయశాఖ అధికారి ప్రభాకర్ తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్స్–84, పవర్ స్ప్రేయర్స్–15, రోటోవేటర్స్–05, ఎంబీ ప్లవ్/కల్టీవేటర్/కేజీవీల్స్–05, విత్తనాలు విత్తే యంత్రము–01, పవర్ వీడర్–01, బ్రష్ కట్టర్–01 పరికరాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఈ నెల 12లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తిగల రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సూచించారు. దరఖాస్తు పత్రంతో పాటు భూమి పట్టాపాస్‌బుక్, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్‌సీ(ట్రాక్టర్ సంబంధిత పనిముట్లకు) జత పర్చాల్సిందిగా సూచించారు.